క్లుప్తంగా

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అడవివరం, విజినిగిరిపాలెం,కృష్ణానగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా సతివాడమ్మతల్లి తొలేళ్లు

గొరపల్లిలో నేడు ప్రధాన పండగ


సతివాడమ్మతల్లి

పెందుర్తి: మండలంలోని గొరపల్లిలో కొలువైన సతివాడమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏడు గ్రామాల ఇలవేల్పుగా ప్రసిద్ధి గాంచిన అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం నిర్వహించిన తొలేళ్ల సంబరం అంబరాన్నంటింది. అనంతరం ఉయ్యాల కంబాల ఘట్టం, చక్రం వంటి ఘట్టాలు ప్రత్యేకార్షణగా నిలిచాయి. ఏలోపూత పేరిట కార్యక్రమం చూడ ముచ్చటగా జరిగింది. మంగళవారం అనుపోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. సాయంత్రం ఘటాల ఊరేగింపు, ఎలేనుగు సంబరం కొనసాగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

మజ్జిగ, అరటి పండ్ల పంపిణీ


అడవివరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న పాశర్ల ప్రసాద్

సింహాచలం: సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలను సోమవారం 98వ వార్డు అడవివరంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ కూడలిలో అవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ పాల్గొని పలువురికి మజ్జిగ అందజేశారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాని తురుణ్ ఆదిత్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అభిమానులు శ్రీను, దాసరి పైడిరాజు, బంతి శ్రీను, వాసు, జనార్దన్, హరి పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తనల శిక్షణ ప్రారంభం


సంకీర్తనలు ఆలపిస్తున్న జ్యోతిర్మయి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని భక్త తుకారాం ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శ్రీవెంకటేశ్వర స్వామి సంకీర్తనల రాయబారి కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 24 వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ శిక్షణలో పాల్గొన్న సుమారు 100 మందికి అన్నమయ్య సంకీర్తనల గురించి జ్యోతిర్మయి వివరించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భక్త తుకారాం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు.

నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం

డాబాగార్డెన్స్ : వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, విశాఖను కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సోమవారం ఆయన సైకిల్‌పై చేరుకున్నారు. ఎకో – వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో – జీరో పొల్యూషన్‌లో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టి అమలు చేస్తోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆహ్లాదం పంచేలా..

దీపాంజలి నగర్‌లో పార్కుల అభివృద్ధి


జీఎం గెస్ట్‌హౌస్ సమీపంలో పార్కు


దీపిక లేడీస్ క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ట్రీ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఉద్యోగుల కుటుంబాలు నివసించే 'దీపాంజలినగర్ టౌన్‌షిప్'ను యాజమాన్యం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. ఇక్కడ వారికి అవసరమైన వసతులు కల్పించింది. ఆహ్లాదంతో పాటు ఆనందం పంచేలా పార్కులు అభివృద్ధి చేసింది. దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో ఏబీసీడీ టైపుల వారీగా నిర్మించిన 1100 ఇళ్లలో సుమారు 2500 మంది నివాసం ఉంటున్నారు. వీరి కోసం టౌన్‌షిప్‌లో పూల మొక్కలతో అందంగా తీర్చిదిద్దిన పార్కులు టౌన్‌షిప్ వాసులతో పాటు సందర్శకులను కూడా మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి.

కల్పించిన వసతులు

- దీపాంజలినగర్ టౌన్‌షిప్ ప్రధాన ద్వారం మొదలుకొని టౌన్‌షిప్‌లో అన్ని రోడ్ల వెంబడి రకరకాల పూల మొక్కలు నాటారు.
- ఎన్టీపీసీ సందర్శన కోసం వచ్చే ప్రత్యేక అతిథుల కోసం టౌన్‌షిప్‌లో సకల సదుపాయాలతో సముద్రిక, శారద అతిథి గృహాలు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తాయి. సుందర వనాలు అతిథులను కట్టిపడేస్తున్నాయి.
- దీపిక లేడీస్ క్లబ్ సముదాయంలోని పార్కులో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు బాలలను ఆకర్షిస్తున్నాయి.
- షాపింగ్ కాంప్లెక్సుకు రాకపోకలు సాగించే వారి కోసం రకరకాల పూల మొక్కలతో పార్కు ఏర్పాటు చేశారు.
- దీపాంజలినగర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సింహాద్రి సరోవర్ చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు చెరువు మధ్యలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సింహాద్రి సరోవర్ సందర్శకులు బోటు షికారుతో ఉత్సాహంగా గడుపుతున్నారు.
- దీపిక లేడీస్ క్లబ్ సముదాయంలోని చిల్డ్రన్ పార్కులో ఏర్పాటు చేసినసోలార్ ట్రీ ఆకట్టుకుంటుంది. టౌన్‌షిప్‌లో ఎటు చూసిన పూల తోటలు, ప్రత్యేక గార్డెన్లు చూపరులకు మంచి అనుభూతి, ఆహ్లాదాన్ని కలుగజేస్తున్నాయి.


దీపాంజలినగర్ వాసుల కోసం సరోవర్


దీపిక లేడీస్‌క్లబ్ సముదాయం


ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన దీపాంజలినగర్ నాలుగు రోడ్ల కూడలి


సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ ముఖద్వారం


డీఎల్ఎస్ భవన్ వద్ద బాలల కోసం ఏర్పాటు చేసిన పార్కు

అప్పన్న సన్నిధిలో ఏపీ జెన్‌కో ఎండీ


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న చక్రధరబాబు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్‌కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే పూజ నిర్వహిస్తారు.

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు


పుష్పాలంకరణలో ఉత్సవమూర్తులు


స్వామివారికి ప్రత్యేక సేవలు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా ముగిసాయి. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానం జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి రప్పించిన పలు రకాల పుష్పాలతో పుష్పయాగం చేశారు. స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అర్చనలు, ఊంజల్ సేవ జరిపారు. అనంతరం వేద మంత్రోచ్చరణ నడుమ మహా పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిసాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఈవో నీలిమ, ఎంఎస్ రాజు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝురి


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: సింహగిరిపై ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

పూర్వ విద్యార్థుల గొప్ప మనసు

ఆపదలో ఉన్న స్నేహితుడికి సాయం


నారాయణరావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పరవాడ: మండలంలో పి.బోనంగి గ్రామానికి చెందిన అనకాపల్లి నారాయణరావు 5 నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. 1993–94 లో పరవాడ జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివాడు. ఇటీవల అనారోగ్యానికి గురై మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న నాటి విద్యార్థులు ముందుకు వచ్చి రూ.70 వేలు నారాయణరావుకు సోమవారం అందజేసి గొప్ప మనసు చాటుకున్నారు. ఆర్థిక సాయం అందజేసిన తోటి విద్యార్థులకు నారాయణరావు కృతజ్ఞతలు తెలియజేశాడు.

నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాల విక్రయాలు

చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్


ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

సీతమ్మధార: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారం చేస్తున్న చైతన్య, నారాయణ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) విశాఖ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి జి.అజయ్ డిమాండ్ చేశారు. రామాటాకీస్ దరి శ్రీచైతన్య, నారాయణ కళాశాలల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం అధిక ధరలకు విద్యార్థులకు విక్రయిస్తున్న పుస్తకాలు, యూనిఫారాలను పట్టుకుని ధర్నా చేసినట్లు చెప్పారు. జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు, ప్రభుత్వ అధికారులు ప్రతి విద్యా సంస్థలో తనిఖీలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ప్రతి కళాశాల వద్ద ధర్నా, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు పి.సాయితేజ, అఖిల్, హర్షిత, సూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరూ సోదర భావంతో మెలగాలి

- గెలుపు ఓటములు సర్వసాధారణం
- పరవాడ డీఎస్పీ సత్యనారాయణ


మల్లునాయుడుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం: ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరవాడ డివిజన్ పరిధిలో పటిష్టమైన చర్యలు తీసుకున్నామని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. మల్లునాయుడుపాలెం,మొగలిపురం,అంతకాపల్లి గ్రామాల్లో సీఐ పిన్నింటి రమణతో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామస్తులతో మాట్లాడి వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసిన తర్వాత గెలుపు ఓటములు సర్వసాధారణమైన విషయం అన్నారు. వచ్చే నెల 4న జరిగే కౌంటింగ్ తర్వాత వచ్చే ఫలితాలపై ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలన్నారు.లేని పక్షంలో హింసాయుత వాతావరణం నెలకునే అవకాశం ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అంతా సోదరుల్లా వ్యవహరించాలని సూచించారు.

ప్రశాంతంగా పండగలు

ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున గ్రామ పండగల్లో డీ జేలు,ఊరేగింపులు,బహిరంగ సభలకు, భారీ ఎత్తున బాణసంచా కాల్పులకు అనుమతులు లేవన్నారు. ముందస్తుగా ఆర్వో అనుమతుల మేరకు మాత్రమే నడుచుకోవాలన్నారు.పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోల్ అమ్మకుండా ఆదేశాల జారీ చేశామన్నారు. లైసెన్స్ లేకుండా బాణ సంచా క్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని మూడు లైసెన్స్ బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీలు చేశామన్నారు.

వైభవంగా తొలేళ్ల సంబరం


అమ్మవార్ల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో కుంచుమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లోని రెడ్డి కంచరపాలెం ప్రజల ఆరాధ్య దైవాలు కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల తొలేళ్ల సంబరం శ్రీరామ సేవా సమాజం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా జరిగింది. అల్లిపురం, కాన్వెంట్ జంక్షన్, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులు పేట, రెడ్డి కంచరపాలెం, ఊర్వశి కూడలి వరకు అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిమను పుట్టబంగారం వద్దకు చేర్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. మంగళవారం అమ్మవార్ల ప్రధాన జాతర నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'గైస్' అభివృద్ధికి సహకారం



కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన పూర్వ విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్(గైస్) అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కెమ్‌దోస్తా పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ మేరకు 1979–1983 బ్యాచ్‌కు చెందిన ఎస్.ఆర్.శర్మ, గోపీకృష్ణ, ఎస్.సత్యనారాయణ, బీఎస్ రామమోహన్, జాన్ రత్నంతో కూడిన పూర్వ విద్యార్థుల బృందం సోమవారం కళాశాలను సందర్శించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర అధ్యాపకులతో సమావేశమయ్యారు. కాలేజీలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, అవసరమైన ఇతర సదుపాయాల వివరాలను వీరు తెలుసుకున్నారు. గైస్‌లో సౌకర్యాల కల్పనకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

ట్రాఫిక్ చక్రబంధం

- అగనంపూడి హనుమాన్ టెంపుల్ జంక్షన్‌లో నిత్యం సమస్య
- ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్


అగనంపూడి మరిడిమాంబ ఆలయ కూడలి


ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

అగనంపూడి: జాతీయ రహదారి అగనంపూడి హనుమాన్ టెంపుల్ జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కూడలి వద్ద ఎనిమిది నుంచి పది నిమిషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకోవల్సి వస్తుండడంతో వాహనచోదకులు హైరానా పడుతున్నారు. గాజువాక, అనకాపల్లి వైపు వెళ్లే మార్గాల్లో రోడ్డు కుదించుకుపోయి ఉండడంతో ట్రాఫిక్‌కు మరింత ఇబ్బంది కలుగుతోంది. గాజువాక వైపు నుంచి వచ్చే ఫార్మా ఉద్యోగుల వాహనాలు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఉదయం భారీగా ఉండడంతో వంద నుంచి రెండొందల మీటర్ల వరకు వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. అలాగే ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల సమయంలో అగనంపూడి, లంకెలపాలెం ప్రాంతాల నుంచి ఉద్యోగులు, విద్యార్థులు కూడా ఈ చక్రబంధంలో చిక్కుకుంటున్నారు.

శాఖల సమన్వయంతోనే సమస్య పరిష్కారం

కూడలి వద్ద ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. దీని వల్ల సిగ్నల్‌తో పనిలేకుండా నేరుగా వెళ్లే వాహనాలు ముందుకు కదిలే అవకాశం ఉంటుంది. కేవలం సిగ్నల్ పాయింట్ వద్ద కుడివైపు రాకపోకలు సాగించే వాహనాలు తప్ప ఇతర వాహనాలు కూడలి వద్ద వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈ సమస్యపై గతంలోనూ సాక్షిలో కథనం వెలువడగా, చర్యలు తీసుకుంటున్నామని అధికారులు అప్పట్లో ప్రకటించారు. కానీ ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. జాతీయ రహదారుల సంస్థ, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ, జీవీఎంసీ, పోలీస్ శాఖ సమన్వయంతో వ్యవహరిస్తే తప్ప సమస్య పరిష్కారం అయ్యే అవకాశం కనపడడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిత్రలేఖనంతో మనోవికాసం

అల్లిపురం: చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో మనోవికాసం కలుగుతుందని విశ్రాంత అధికారి ఆర్.రెడ్డి అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు ఆయన న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. పోటీల్లో చిన్నారులు వివిధ థీమ్‌లతో చిత్రాలను చిత్రించారు.